
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

5 జనగామ
శనివారం 3 ఆగస్టు 2024

ఆరేళ్ల నిరీక్షణకు తెర

కొత్త రేషన్‌కార్డులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్



- జిల్లాలో 6వేల నూతన దరఖాస్తులు
- సంఖ్య ఇంకా పెరిగే అవకాశం
- ప్రస్తుతం 1.61 లక్షల ఆహార భద్రత కార్డులు
- ప్రభుత్వ ప్రకటనతో అర్హుల్లో చిగురిస్తున్న ఆశలు

రఘునాథపల్లి, ఆగస్టు 2: ఆరేళ్ల నిరీక్షణకు తెరపడింది. కొత్త రేషన్‌కార్డుల జారీకి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గురువారం హైదరాబాద్‌లో జరిగిన క్యాబినెట్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయమై ప్రకటన చేశారు. దీంతో జిల్లాలో నూతనంగా దరఖాస్తు చేసుకున్న సుమారు 6 వేల కుటుంబాలకు రేషన్ కార్డులు అందనున్నాయి. ఇప్పటివరకు కార్డుల్లో పేర్లు తొలగిస్తున్న అధికారులు కొత్తగా పేర్లను మాత్రం చేర్చడం లేదు. కూతురి పెళ్లి కాగానే పుట్టింటి వారి రేషన్ కార్డులోనుంచి ఆ యువతి పేరు తొలగిస్తున్న అధికారులు అత్తింటి వారి రేషన్‌కార్డులో మాత్రం చేర్చడం లేదు. దీంతో అర్హత ఉన్నప్పటికీ పేదలకు రేషన్ బియ్యం, ఇతర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ప్రయోజనాలు అందకుండా పోతున్నాయి. కొత్త రేషన్‌కార్డుల జారీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఇన్ని రోజులుగా రేషన్ కార్డు లేదనే కారణంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరంగా ఉన్నవారిలో ఆనందం వెల్లువిరిసింది. జిల్లాలో ప్రస్తుతం 1,61,147 ఆహార భద్రత కార్డులున్నాయి.. ఇందులో 4,86,615 మంది కుటుంబ సభ్యులు నమోదై ఉన్నారు. రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకుని ఆరు సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నారు. 2018 నుంచి ఇప్పటివరకు రేషన్‌కార్డుల జారీని నిలిపివేసిన ఫలితంగా వేల సంఖ్యలో కుటుంబాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్నాయి. ఆరేళ్లుగా కొత్త రేషన్‌కార్డులు మంజూరుకాకపోవడంతో ఉమ్మడి కుటుంబంలో ఉండి వేరుపడిన వారికి కార్డులు లేకుండపోయాయి. దీంతో వారంతా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలను అందుకోలేకపోతున్నారు. ఇపుడు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో వారిలో ఆశలు చిగురించాయి.

ఆరు గ్యారంటీలకు కీలకం..

కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు శ్రీకారం చుట్టింది. ఆ పథకాలు పొందాలంటే రేషన్‌కార్డు ప్రామాణికమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రజాపంపిణీ బియ్యం అందాలన్నా, పింఛన్ పొందాలన్నా, రుణమాఫీ అమలు కావాలన్నా రేషన్ కార్డు తప్పనిసరి. అయితే ఆరేళ్లుగా కొత్త రేషన్‌కార్డుల జారీ నిలిచిపోవడంతో పుట్టింటి నుంచి మెట్టింటికి వెళ్లిన కొత్త కోడళ్లకు శాపంగా మారింది. ఇంటి పేరు మారినా రేషన్‌కార్డుల్లో మాత్రం పేరు నమోదు కావడం లేదు. ఈ ఆరేళ్లలో పెళ్లయిన జంటలకు ఇప్పటి వరకు రేషన్‌కార్డులు లేవు. ప్రభుత్వ నిబంధనలతో వీరంతా గ్యారెంటీ పథకాలకు ఇప్పటివరకు దూరమవుతూ వచ్చారు.



ఆహార భద్రత కార్డు ఆన్‌లైన్ పోర్టల్

బ్యాంకు ఖాతాలు మనుగడలో లేకపోతే..

గ్యాస్ వినియోగదారులు సిలిండర్ ధరను ఏజెన్సీ నిర్వాహకులకు చెల్లించి సిలిండర్ తీసుకోవాలి. సిలిండల్ తీసుకున్న తర్వాత వారి ఖాతాల్లో సబ్సిడీ డబ్బులు జమచేస్తారు. గ్యాస్ వినియోగదారుల్లో రేషన్‌కార్డుదారులే అత్యధికులు ఉంటారు. బ్యాంకు ఖాతాలు సక్రమంగా కొనసాగుతున్న వారికి మాత్రమే సబ్సిడీ డబ్బులు జమఅయ్యే అవకాశం ఉంటుంది. రేషన్‌కార్డుకు అనుసంధానమై ఉన్న బ్యాంకు ఖాతా వినియోగంలో లేకపోతే సబ్సిడీ రావడం లేదు.

అదేవిధంగా గృహజ్యోతి పథకం కింద రేషన్‌కార్డుదారులకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత గృహ విద్యుత్ పథకాన్ని ప్రారంభించారు. జిల్లాలో రెండు లక్షలకు పైగా విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. వీరిలో రేషన్‌కార్డులు లేని వారు ఎక్కువమందే ఉండడం గమనార్హం. వీరంతా రేషన్‌కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు.

ఎట్టకేలకు దరఖాస్తులకు మోక్షం..

గతంలో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఆ ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో కొత్త కార్డులు మంజూరు కాలేదు. ప్రజాపాలనలో భాగంగా అధికారులు దరఖాస్తులు స్వీకరించగా ఇందులో రేషన్‌కార్డులకు వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. కొత్త రేషన్‌కార్డుల కోసం, పిల్లల పేర్ల చేర్పులు, వివాహమైన వారి పేర్ల నమోదుకు ఎన్నో కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి. అయితే కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలకు రేషన్‌కార్డులను ప్రామాణికంగా తీసుకోవడంతో ఒకే ఇంట్లో వేరువేరుగా ఉంటున్న అన్నదమ్ములు, తల్లిదండ్రులు ఇబ్బందిపడుతున్నారు.

ఆదేశాలు రాగానే కార్డులు జారీ చేస్తాం..

- రోజారాణి, డీఎస్‌వో, జనగామ



కొత్త రేషన్ కార్డుల జారీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాల్సిన అవసరం ఉంది. కొత్త కార్డుల కోసం కానీ, కార్డుల్లో కొత్త పేర్ల నమోదు, మార్పులు, చేర్పులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ కావడమే ఆలస్యం.. వెంటనే కొత్త రేషన్ కార్డులను జారీ చేస్తాం. జిల్లాలో ప్రస్తుతం 1,61,147 ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. వీరికి 335 రేషన్ షాపుల ద్వారా ప్రతి నెలా1,038.15 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నాం.

కమీషన్ల కోసం ఎమ్మెల్యే ఆరాటం

- ఏటీఎంలా మారిన రిజర్వాయర్ల నిర్మాణం
- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రామ్మోహన్‌రెడ్డి



పాలకుర్తిలో మాట్లాడుతున్న లేగ రామ్మోహన్‌రెడ్డి

పాలకుర్తి, ఆగస్టు 2: నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేసి కేవలం కమీషన్ల కోసమే ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆరాటపడుతున్నారని పాలకుర్తి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి లేగ రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన ఆ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ల నిర్మాణం అప్పుడు మాజీ మంత్రి దయాకర్‌రావుకు, ఇపుడు ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డికి ఏటీఎంగా మారాయని అన్నారు. రిజర్వాయర్లకు మరిన్ని నిధులు మంజూరి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే కోరడం కేవలం కమీషన్లు దండుకోవడం కోసమేనని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఆమె పాలకుర్తిలో జూనియర్, డిగ్రీ కళాశాలలను ఆరు నెలల్లోనే మంజూరి చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గెలిచి ఎనిమిది నెలలు గడిచినా ఇంతవరకు ఆ ఊసే ఎత్తడం లేదని అన్నారు. పాలకుర్తి, తొర్రూరులో 50 పడకల ఆస్పత్రులను వంద పడకలకు అప్‌గ్రేడ్ చేస్తానని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. సొంత డబ్బులు ఖర్చు చేసి 30 కిలోమీటర్ల వరకు కాల్వల్లో ఉన్న చెట్లను తొలగించానని చెప్పడం పచ్చి అబద్ధమన్నారు. నియోజకవర్గంలో ఏ ఊరు నుంచి ఏ ఊరు వరకు 30 కిలోమీటర్లు దూరం చెట్లను తొలగించారో ప్రజలకు పత్రికల ద్వారా తెలపాలని డిమాండ్ చేశారు. డబుల్‌బెడ్ రూం ఇండ్లలో నివాసం ఉంటున్న పేదోళ్లను ఎందుకు బయటికి వెళ్లగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పార్కు నిర్మిస్తామని చెప్పి మాట మార్చారని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు దొంగరి మహేందర్, కమ్మగాని శ్రీకాంత్, దుంపల సంపత్, వేల్పుల దేవరాజ్, కడుదల నిరంజన్‌రెడ్డి, పెనుగొండ సోమేశ్వర్, చింత సృజన్, ఉపేందర్, సత్తయ్య, నగేష్, ముకద్దం, సురేష్, లాకావత్‌రవి, ప్రవీన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో
'వర్గీకరణ' సంబరాలు
పీఎం, సీఎం, మందకృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు
వివరాలు 8లో..

డీపీవోగా స్వరూప



డీపీవోగా బాధ్యతలు స్వీకరించిన స్వరూప

జనగామ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ అధికారిగా నాగపురి స్వరూప శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ములుగు జిల్లా పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న ఆమె జనగామకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా డీపీవో కార్యాలయ ఉద్యోగులు ఆమెకు అభినందనలు తెలిపారు. కాగా.. ఇక్కడ డీపీవోగా పనిచేసిన కె.రంగాచారి పదవీ విరమణ పొందగా జడ్పీ సీఈవో అనిల్‌కుమార్‌కు ఇన్‌చార్జి డీపీవోగా బాధ్యతలు ఇచ్చారు. ఇటీవల ఆయన హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లడంతో స్వరూపను ప్రభుత్వం జనగామకు బదిలీ చేసింది.

ఏసీబీకి చిక్కిన పర్వతగిరి ఎస్సై

- స్టేషన్ బెయిల్ మంజూరుకు రూ.70వేల డిమాండ్
- రూ.40వేలు తీసుకుంటూ దొరికిన గుగులోత్ వెంకన్న



ఏసీబీకి పట్టుబడిన డ్రైవర్, ఎస్సై

పర్వతగిరి, ఆగస్టు 2: ఓ కేసులోని నిందితులకు స్టేషన్‌బెయిల్ మంజూరుకు లంచం తీసుకుంటూ వరంగల్ జిల్లా పర్వతగిరి ఎస్సై గుగులోత్ వెంకన్న ఏసీబీ అధికారులకు శుక్రవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య కథనం ప్రకారం. పర్వతగిరి మండలంలోని అన్నారంషరీఫ్ మీదుగా గత నెల 27 రాత్రి ఓ ట్రాలీ ఆటోలో నల్లబెల్లం, పటిక తరలిస్తుండగా.. ఎస్సై వెంకన్న ఆధ్వర్యంలో పెట్రోలింగ్ పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. వాటిని తరలిస్తున్న సంగెం మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన బెల్లం వ్యాపారి బాదావత్ భాస్కర్, డ్రైవర్ రాజేష్, వర్కర్ రవిపై కేసు నమోదు చేశారు. అయితే వారిని జ్యుడీషియల్ కస్టడీకి పంపకుండా, 35 క్లాజ్ (బీ) బీఎన్‌ఎస్ యాక్ట్ కింద నోటీసులు ఇవ్వకుండా వారిని పోలీస్‌స్టేషన్ చుట్టూ తిప్పించుకున్నాడు. ఈ క్రమంలో అజ్మీరా వెంకట్ అనే వ్యక్తి ద్వారా విషయం గురించి బాధితులు ఆరా తీయగా రూ.70వేలు ఇస్తే స్టేషన్ బెయిల్ ఇస్తానని, లేదంటే వారిని జైలుకు పంపుతానని ఎస్సై స్పష్టం చేశారు. అయితే తమ వద్ద ప్రస్తుతం అంత డబ్బు లేదని చెప్పడంతో రూ.20 వేలను ఓ ప్రైవేటు వ్యక్తి ద్వారా ఎస్‌ఐ ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. మిగతా రూ.50వేలు కూడా ఇస్తేనే నోటీసులు ఇస్తానని, లేకపోతే జైలుకు పంపిస్తానని హెచ్చరించడంతో బాధితుడు బాదావత్ భాస్కర్ ఏసీబీ కార్యాలయంలో అధికారులను సంప్రదించాడు. దీంతో శుక్రవారం అధికారులు పథకం ప్రకారం రూ.40వేలు ఇస్తామని నిందితుడు భాస్కర్ ద్వారా ఎస్సైకి ఫోన్ చేయగా, ఆయన తన డ్రైవర్ సదానందానికి ఇవ్వాలని సూచించాడు. ఎస్సై చెప్పినట్టు డ్రైవర్‌కు డబ్బులు ఇవ్వగా అతడు వాటిని తీసుకుని ఎస్‌ఐ ఆఫీసుకు వెళ్లగా, ఏసీబీ అధికారులు పథకం ప్రకారం దాడి చేసి డ్రైవర్ సదానంతోపాటు, ఎస్సై వెంకన్నను అదుపులోకి తీసుకున్నారు. వీరిని శనివారం వరంగల్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్టు డీఎస్పీ వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది ఎవరైనా లంచం అడిగితే టోల్‌ఫ్రీ నెంబర్ 1064 నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. దాడుల్లో ఇన్‌స్పెక్టర్లు ఎల్.రాజు, ఎస్.రాజు, శ్యాంసుందర్, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ సాంబయ్య

ఎస్టీల సమస్యలపై దృష్టి సారించాలి

- జాతీయ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న హుస్సేన్ నాయక్

జనగామ కల్చరల్, ఆగస్టు 2: షెడ్యూల్ తెగల ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, డీసీపీ రాజమహేంద్రనాయక్ తో కలిసి ఆయా శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలకు సంబంధించిన భవన నిర్మాణాలకు భూసేకరణ నివేదికను పదిహేను రోజుల్లోగా ఇవ్వాలన్నారు. పీవోఏ యాక్టు కింద ఎస్టీ అట్రాసిటీ కేసులను నమోదు చేయాలని, తండాల్లో వీధి దీపాలు, రోడ్లు, వాటి మరమ్మతులు వెంటనే చేపట్టాలన్నారు. ఎస్టీ కార్పొరేషన్ కింద రుణాలు మంజూరు చేయాలన్నారు. నూతన గ్రామ పంచాయతీలలో రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో గిరిజన ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో గిరిజనుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. తండాల్లో వెలసిన మద్యం, బెల్టు షాపులపై ఎక్సైజ్ శాఖ అధికారులు కఠినంగా వ్యవహరించాలన్నారు. విద్యాశాఖలో ఉన్న పలు సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ జిల్లాలో రెండు డివిజన్లు, ఒక మునిసిపాలిటీ, 281 గ్రామ పంచాయతీలు ఉన్నాయని, 2011 జనాభా గణన ప్రకారం 62 వేల మంది ఎస్టీలు ఉన్నారని అన్నారు. వివిధ శాఖల వారీగా షెడ్యూల్ తెగల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గిరిజనులు హుస్సేన్ నాయక్‌కు పలు సమస్యలతో కూడిన దరఖాస్తులను అందజేశారు. సమావేశంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్‌డీవో వెంకన్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సు దిగబోతూ..

టైరు కింద పడి ఏడేళ్ల బాలుడి మృతి

- డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన



బానోతు వరుణ్ (ఫైల్)

జిల్లా 7లో..

చీటకోడూరు బ్రిడ్జికి నిధులు కేటాయించండి



శాసనమండలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

జనగామ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జనగామ మండలం చీటకోడూరులో వాగుపై ఉన్న లోలెవల్ కల్వర్టు నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన శాసనమండలిలో మాట్లాడుతూ చీటకోడూరు లోలెవల్ కల్వర్టు సమస్యను సభ దృష్టికి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. చీటకోడూరులో నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన బ్రిడ్జి ధ్వంసమై రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందన్నారు. వర్షాలు పడిన సమయంలో గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోతున్నాయని, గత ప్రభుత్వ హయాంలో ప్రజలు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సమస్య పరిష్కారం కాలేదని, ప్రజలంతా జేఏసీగా ఏర్పడి పోరాటాలు చేస్తున్నారని అన్నారు. చీటకోడూరు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి, పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కోరారు.

బైకులు అపహరిస్తున్న వ్యక్తి అరెస్టు



మీడియాతో మాట్లాడుతున్న పోలీసులు

జనగామ కల్చరల్, ఆగస్టు 2: జిల్లా కేంద్రంలో మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. కేసు వివరాలను సీఐ రఘుపతిరెడ్డి మీడియాకు వెల్లడించారు. గత నెల 31న జనగామ మునిసిపాలిటీ పరిధి బాలాజీనగర్‌లో అంకం మణిదీప్ అనే వ్యక్తి తన ఇంటి ముందు పల్సర్ వాహనాన్ని పార్కు చేశాడు. అదేరోజు రాత్రి జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు గ్రామానికి చెందిన ఉప్పు రమణారెడ్డి బైక్‌ను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించగా మణిదీప్ గమనించి కేకలు వేయడంతో పారిపోయాడు. మరుసటి రోజు తను పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ భరత్ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం జనగామ రైల్వేస్టేషన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నిందితుడు పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశాడు. వెంబడించి పట్టుకున్న పోలీసులు విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకోవడంతో పాటు గతంలో జనగామతో పాటు కరీంనగర్ జిల్లా వెలగటూరు, గంగాధర, మల్యాల, వేములవాడ ప్రాంతాల్లో మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడి జైలుకు కూడా వెళ్లి వచ్చినట్లు అంగీకరించాడు. దీంతో నిందితుడిని కోర్టుకు రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు.

గంజాయి కేసులో ముగ్గురి అరెస్టు

వరంగల్ క్రైం, ఆగస్టు 2: గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను కాకతీయ యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 80 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఓఆర్ఆర్‌పై పెట్రోలింగ్ చేస్తుండగా టోల్ ప్లాజా వద్ద ముగ్గురు యువకులు కారులో గంజాయి సేవిస్తూ అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులను గమనించిన యువకులు పారిపోయే ప్రయత్నం చేయగా పట్టుకుని ప్రశ్నించగా గంజాయి కలిగి ఉన్నట్లు గుర్తించారు. పి.కృష్ణారెడ్డి, సాయిపవన్, పి.అరవింద్ అనే ముగ్గురు యువకులను అరెస్టు చేసి కారు, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని ఎస్ఐ రవిందర్ ధృవీకరించారు.

● ఐనవోలు : ఎండు గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండల కేంద్రంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా కొండపర్తి గ్రామానికి చెందిన బుంగ కల్యాణ్ ఆటోలో వచ్చి పోలీసులను చూసి పరిగెత్తే ప్రయత్నం చేశాడు. ఆటోను తనిఖీ చేయగా ఒక ప్లాస్టిక్ కవర్‌లో 100 గ్రాముల ఎండు గంజాయి లభించింది. దీని విలువ సుమారు రూ.2,500 వరకు ఉంటుంది. ఆటోతోపాటు సెల్‌ఫోన్, గంజాయిని స్వాధీనం చేసుకొని అతడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుచగా నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



హనుమకొండలోని ఓఆర్ఆర్‌పై పట్టుబడిన ముగ్గురు యువకులు

స్కూటీతో ఢీకొట్టిన వ్యక్తిపై చర్య తీసుకోవాలి

వరంగల్ క్రైం, ఆగస్టు 2: తన తండ్రి సిలువేరు వీరస్వామిని స్కూటీ అతి వేగంగా నడుపుకుంటూ వచ్చి ఢీకొట్టిన ఎం.భరత్‌పై చర్య తీసుకుని న్యాయం చేయాలని సిలువేరు పున్నం శుక్రవారం హసన్‌పర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కూలీపని చేసే తన తండ్రి గత నెల 24న గ్రామంలో ఒకరి ఇంటివద్ద పని చేస్తుండగా వేగంగా వచ్చిన భరత్ ఢీకొట్టడంతో కాలుకు తీవ్ర గాయమైందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నామని, తీవ్ర గాయం కావడంతో కాలు తొలగించే పరిస్థితి వచ్చిందని తెలిపారు. తన తండ్రిని ఢీకొట్టిన భరత్‌పై చర్య తీసుకుని న్యాయం చేయాలని పున్నం కోరారు.

అమెరికా రోడ్డు ప్రమాదంలో గుండ్రాతిమడుగువాసి మృతి

- స్వగ్రామంలో రోహిత్‌రెడ్డి అంత్యక్రియలు పూర్తి


రోహిత్‌రెడ్డి (ఫైల్)

కురవి, ఆగస్టు 2: మహబూబాబాద్ జిల్లా కురవి మండలం గుండ్రాతిమడుగు గ్రామానికి చెందిన బండి రోహిత్‌రెడ్డి(27) అమెరికాలోని టెక్సాస్‌లో జూలై 24న మృతి చెందాడు. ఏప్రిల్ 27న టెక్సాస్‌లో తన స్నేహితులతో కలిసి కారులో వెళ్తుండగా మరో వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో రోహిత్‌రెడ్డి తలకు తీవ్రగాయాలై కోమాలోకి వెళ్లాడు. చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతదేహాన్ని శుక్రవారం ఉదయం విమానంలో హైదరాబాద్‌కు తీసుకురాగా, స్వగ్రామమైన గుండ్రాతిమడుగుకు మధ్యాహ్నం తీసుకువచ్చారు. రెండు గంటలకు రోహిత్‌రెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, బండి అనిల్‌రెడ్డి-అనితారెడ్డి దంపతులకు రోహిత్‌రెడ్డి, రోహన్‌రెడ్డి కుమారులు. పెద్ద కుమారుడు రోహిత్‌రెడ్డి కాగా, అవివాహితుడు. ఇద్దరు అన్నదమ్ములు ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. కుమారుడి మృతదేహం చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు. అంత్యక్రియల్లో జడ్పీటీసీ బండి వెంకట్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ గార్లపాటి వెంకట్‌రెడ్డి, భరద్వాజ్ రెడ్డి, బండి అజయ్‌రెడ్డి, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

భర్త కనిపించడం లేదని ఫిర్యాదు

వరంగల్ క్రైం, ఆగస్టు 2: తన భర్త, అత్త కనిపించడం లేదని హసన్‌పర్తికి చెందిన పి.సాయిశివాని శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత నెల 17న తనతో భర్త మణిదీప్, అత్త గొడవపడి పుట్టింటికి వెళ్లగొట్టినట్లు తెలిపారు. తిరిగి తల్లిదండ్రులతో 22వ తేదీన రాగా, భర్త, అత్త ఇంట్లో లేరని, ఇంటికి తాళం వేసి ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. సెల్‌ఫోన్లు స్విచ్‌ఆఫ్‌లో ఉన్నాయని, బంధువులు, తెలిసిన వారి ఇళ్లకు తిరిగినా ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు.

తాండేమా బోరాయి తీజ్

- ప్రకృతి పరవశించే సంప్రదాయ ఉత్సవం
- నేటి నుంచి 11 వరకు వేడుకలు
- తొమ్మిది రోజులు తండాల్లో సందడే సందడి
- ఆటపాటలతో గిరిజనుల్లో జోష్
- ఒకేసారి నిర్వహించుకోవాలని గిరిజనుల యోచన
- తీజ్ పండుగకు గుర్తింపు ఇవ్వాలని బంజారాల డిమాండ్


తీజ్ బుట్టలను నిమజ్జనానికి తీసుకువెళ్తున్న గిరిజన మహిళలు (ఫైల్)

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 2: గోర్ బంజారాలు సంస్కృతి, సంప్రదాయబద్ధంగా.. ప్రకృతి పరవశించే విధంగా ఏడుగురు కుల దేవతల్లో ఒకరైన మేరామాయాడిని స్మరిస్తూ మేరమా మాత అనుగ్రహంతో జన్మించిన సేవాలాల్ మహారాజ్‌ను మనసారా కొలిచి వేడుకలు నిర్వహిస్తారు. పాడిపంటలు, పిల్లపాప, పశువులు చల్లాగా ఉండేలా దీవించాలని లంబాడ గిరిజనులు భక్తిశ్రద్ధల నడుమ గోధుమ నారుపోసి, గడ్డి బతుకమ్మతో తీజ్ పండుగను జరుపుకుంటారు. ఏటా శ్రావణ మాసంలో తొమ్మిది రోజుల పాటు వారి వెసులుబాటును బట్టి ఉత్సవాలు నిర్వహిస్తారు. పూర్వకాలంలో నిరక్షరాస్యులైన గిరిజనులు వ్యవసాయ సీజన్‌ను అంచనా వేయడానికి వర్షాకాల ఆరంభం అనంతరం వరినాట్లు పూర్తిచేసుకొని తీరిక సమయాల్లో తీజ్ పండుగకు సన్నద్ధమవుతారు. ఈ ఆచార సంప్రదాయ పండుగలు నేటికి కొనసాగుతూ వస్తున్నాయి. ఇక ఈ ఏడాది శనివారం నుంచి ప్రారంభం కానున్న వేడుకలు 11 వరకు తొమ్మిది రోజులపాటు కొనసాగనున్నాయి. ఒకేసారి ఈపండుగను నిర్వహించుకోవాలని గిరిజనులు యోచిస్తున్నారు. తీజ్ పండుగను ప్రభుత్వం అధికారికంగా గుర్తించి సెలవుదినంగా ప్రకటించాలని గిరిజనులు కోరుతున్నారు.

తీజ్ నేపథ్యం ఇదీ..

గోర్ బంజారాలు శ్రీసేవాలాల్ మహారాజ్, దండి మేరామ మాతను దైవ దూతలుగా కొలుస్తారు. తండాల్లోని పెళ్లి కాని అమ్మాయిలు తమ తల్లిదండ్రులకు పంటలు బాగా పండాలని, అభివృద్ధి చెందాలని భావిజీవితం సవ్యంగ కొనసాగాలని భార్యాభర్తల మధ్య ఉండే ప్రేమానురాగాలు మరింతగా బలపడాలని పార్వతీదేవి శివునిప్రేమ పొందడానికి 107 జన్మలెత్తి 108వ జన్మలో శివున్ని భర్తగా పొందిన రోజు గుర్తుగా ఈ తీజ్ పండుగను నిర్వహిస్తారని ఇతిహాసాలు పేర్కొంటున్నాయి. ఈ దేవతను కొలుస్తూ కన్నెలు ఎన్నోవిధాలుగా అభ్యర్థిస్తూ శ్రావణమాసంలో తొమ్మిది రోజుల పాటు ఈ పండుగను నిర్వహిస్తారు. ఉత్తర భారతదేశంలో తీజ్ పండుగను పెళ్లయిన మహిళలు నిర్వహిస్తారు. తమ భర్తల నుంచి ప్రేమానురాగాలు పొందడానికి ఈ పండుగను జరుపుకోవడం విశేషం.


గుండ్లబోడు తండాలో తీజ్ బుట్టపై నీరు పోస్తున్న బాలిక (ఫైల్)

తొమ్మిదో రోజు ఇలా..

తొమ్మిదో రోజును బంజారాలు అత్యంత భక్తిశ్రద్ధల నడుమ తీజ్ ఘనంగా నిర్వహించుకుంటారు. తీజ్ నిమజ్జనానికి బంధు, మిత్రులందరినీ ఆహ్వానిస్తారు. అత్యంత పవిత్రంగా మేరామ మాతను, సేవాలాల్ మహారాజ్‌కు పూజలు చేస్తారు. డప్పు చప్పుళ్లతో గిరిజన సంస్కృతి సంప్రదాయం ప్రకారం పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ తొమ్మిదో రోజు ఘనంగా నిర్వహిస్తారు. ఆడపిల్లలు పెంచిన తీజ్‌ను తండానాయక్ పరిశీలించి ఒక్కొక్క బుట్టను ఆడ పిల్లలకు అందజేస్తారు. తమను ఆపదల నుంచి రక్షించాలని అన్నాదమ్ములకు నారు ఇచ్చి ఆశీర్వాదాలు తీసుకుంటారు. ఈ గోధుమ నారు అత్యంత పవిత్రమైందని. దీనివల్ల శుభం జరుగుతుందని నమ్మకం. తీజ్ బుట్టలను పట్టుకుని వరసగా నిమజ్జనానికి డప్పుచప్పుల్లతో బయలుదేరుతారు. ఆటా..పాటలు కేరింతలతో ఆనంద భరితంగా ఈ నిమజ్జన వేడుక కొనసాగుతుంది. చెరువు దగ్గర ఈ తీజ్ నిమజ్జనం ఓ అద్భుతమైన సన్నివేశం జరుగుతుంది. తీజ్ తమను వదలివెళ్లి పోతుందనే దుఃఖంతో ఆడపిల్లలు ఏడుస్తుంటే పెద్దలు, సోదరులు వారిని ఊరడిస్తుంటారు. జీవితాంతం నీకు తోడుగా ఉంటూ రక్షిస్తానని చెల్లెల్ని పీటపై నిల్చోపెట్టి కాళ్లను కడిగి సోదరుడు పాదాభివందనం చేస్తాడు. ఆ తర్వాత చెరువులో తీజ్‌ను నిమజ్జనం చేస్తారు.

ఈ ఏడాది తీజ్ పండుగ వివరాలు..

లంబాడ గిరిజనులు ఎంతో భక్తిశ్రద్ధల నడుమ జరుపుకునే తీజ్ పండుగను ఒకేసారి జరుపుకోవాలని గిరిజన పెద్దలు తేదీలు ఖరారు చేశారు. ఈ ఏడాది తొమ్మిది రోజుల పాటు తీజ్ వేడుకలు నిర్వహించుకొని గిరిజనులు ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు. తొలి రోజు శనివారం గోధుమలు నానబెట్టడం, ఆదివారం తీజ్ బుట్టలో వేయుట, 5న సోమవారం బోరడి తీజ్, 9న డమోలీ తీజ్, 10న ఘనగోర్ తీజ్, చివరి రోజు 11న నిమజ్జనం చేసేందుకు తేదీలను ప్రకటించారు. వివిధ తండాలకు చెందిన గిరిజనులు ఆయా తేదీల్లో తీజ్ పండుగను జరుపుకోవాలని సూచించారు.


మహబూబాబాద్ శివారు తండాలో తీజ్ బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం (ఫైల్)

తీజ్ పండుగకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలి

డాక్టర్ బానోత్ నెహ్రూరాథోడ్, మహబూబాబాద్



గోర్ బంజార సంస్కృతి కూడా భారతదేశ సంస్కృతిలో అంతర్భాగమే. భారతీయ సంస్కృతులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. తెలుగురాష్ట్రాల్లో లంబాడీ గిరిజనులు మాత్రమే నిర్వహించుకునే తీజ్ పండుగను శనివారం నుంచి 11 వరకు ఒకే కాలంలో నిర్వహించుకొని జాతీ ఐక్యతను చాటుకోవాలి. ప్రభుత్వాలు కూడా 9 రోజులు నిర్వహించే తీజ్ పండుగలో పవిత్రరోజైన డమోళీ తీజ్ (7వ రోజు శుక్రవారం) సెలవు ప్రకటిస్తే చివరి మూడురోజులు (డమోళీ తీజ్, గణగోర్ తీజ్, కడావ్ తీజ్) ఘనంగా నిర్వహించి తీజ్ పండుగ ప్రాముఖ్యతను భావి తరాలకు అందించడానికి వీలుంటుంది.

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక

గుగులోతు కిషన్‌నాయక్, గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపకుడు మానుకోట



లంబాడ గిరిజనులు ఏటా నిర్వహించుకునే తీజ్ పండుగ గిరిజన సంప్రదాయం, భక్తిభావం, క్రమశిక్షణతో పాటు అన్నాచెల్లెల అనుబంధానికి ప్రతిరూపంగా నిలుస్తోంది. నిజజీవితంలో ఆడపిల్లలకు కష్టాలు ఎదురైనప్పుడు నీ కష్టాల్లో తోడుగా నేనున్నాని(అన్న) భరోసా, మనోధైర్యం కల్పించే పండుగ తీజ్. ప్రతి ఏటా తీజ్ నిమజ్జనం రోజు చెరువు దగ్గర చెల్లెలిని పీటపై నిల్చోబెట్టి సోదరులు కాళ్లు కడిగి పాదాభివందనం చేస్తారు. ఈ బంధం కలకాలం ఇలాగే ఉండాలని సోదరులను చెల్లెళ్లు ఆశీర్వదించడం ఆనవాయితీగావస్తోంది.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



కాజీపేట, ఆగస్టు 2: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాజీపేట రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట - పెండ్యాల రైల్వేస్టేషన్‌ల మధ్య గురువారం రాత్రి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి వయస్సు 30 - 35 సంవత్సరాలలోపు ఉంటుంది. ఎత్తు 5.7 ఛామన ఛాయ రంగు, నలుపు రంగు ప్యాంటు, గులాబీ రంగు చొక్కా ధరించి ఉన్నాడు. మృతుడిని గుర్తించడానికి ఎలాంటి ఆనవాళ్లు లేవు. రైల్వే ఉద్యోగుల సమాచారం మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్ నంబర్ 87126 58609 సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య


రాజు మృతదేహం

భీమదేవరపల్లి, ఆగస్టు 2: భీమదేవరపల్లి మండలం మల్లారం గ్రామంలో కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబు కథనం ప్రకారం.. మల్లారం గ్రామానికి చెందిన దండెం రాజు(27) సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం మంచినీళ్లబండ గ్రామానికి చెందిన రవళితో 8 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లున్నారు. భార్యభర్తల మధ్య తరుచూగా గొడవలు జరుగుతున్నాయి. గత నెల 25న భర్తతో గొడవ పడి రవళి తన పుట్టింటికి వెళ్లింది. రాజు అప్పటి నుంచి తన భార్యను తన ఇంటికి రావాల్సిందిగా పలుమార్లు ఫోన్లు చేశాడు. కానీ రవళి తన పుట్టింటి వద్దనే ఉంటుంది. పిల్లలని చూడాలని ఉందని, కోరినా రవళి స్పందించలేదు. దీంతో నిరాశకు గురైన భర్త రాజు గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి లింగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబు తెలిపారు.

కెమిస్ట్రీలో బానోతు రెడ్డికి డాక్టరేట్



కేయూ క్యాంపస్, ఆగస్టు 2: మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ బానోతు రెడ్డి డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు ఏపీలోని మచిలీపట్నంలోని కృష్ణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారులు డాక్టరేట్ ప్రకటించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. క్యాన్సర్ కణాల నిర్మూలనకు చేసిన విలువైన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేశారు. 'సింథసిస్ ఆఫ్ టెట్రాజోన్ ఫ్యూజ్డ్ ఇమిడాజో ఫిరడిన్స్ అనే అంశంపై కృష్ణ వర్సిటీ కెమిస్ట్రీ విభాగాధిపతి, రెక్టార్ ఎంవీ భసవేశ్వరరావు పర్యవేక్షణలో బానోతు రెడ్డి పరిశోధన గ్రంథాన్ని పూర్తి చేశారు. డాక్టరేట్ సాధించిన బానోతు రెడ్డిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బొలగాని రాములు, ఇతర అధ్యాపకులు అభినందించారు.

ముగ్గురు గురుకుల విద్యార్థులకు అస్వస్థత

- ఒకరికి విషపురుగు కుట్టినట్లు నిర్ధారణ
- మరో విద్యార్థి పరిస్థితి విషమం
- బండారుపల్లి తెలంగాణ గురుకులంలో ఘటన


బండారుపల్లిలోని తెలంగాణ బాలుర గురుకులం

ములుగు, ఆగస్టు 2: 12గంటల వ్యవధిలో ముగ్గురు విద్యార్థులు అస్వస్థతకు గురికాగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ములుగు జిల్లాలోని ములుగు మండలం బండారుపల్లి తెలంగాణ బాలుర గురుకులంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలీవిధంగా ఉన్నాయి. గురువారంరాత్రి నిద్రకు ఉపక్రమించే సమయంలో 8వ తరగతి విద్యార్థి శ్రీకర్ కాళ్లు తిమ్మిరెక్కడంతో ఇబ్బంది పడ్డాడు. ఉపాధ్యాయులు వెంటనే బాలున్ని ములుగు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స తర్వాత ఎంజీఎంకు తీసుకువెళ్లారు. విషపురుగు కుట్టినట్లు గుర్తించిన వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం శ్రీకర్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది. ఇదేక్రమంలో శుక్రవారం తెల్లవారుజామున 5గంటలకు వెంకటాపూర్(రామప్ప) మండలం కేశవాపూర్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థి ప్రణయ్ కడుపునొప్పితో బాధపడుతుండగా ములుగు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స తర్వాత ఉపాధ్యాయులు హనుమకొండ జిల్లా ఆరెపల్లి వద్దగల ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ప్రణయ్ కోలుకున్నాడు. ఉదయం8గంటల సమయంలో పాఠశాల మైదానంలో ప్రార్థన జరుగుతుండగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లికి చెందిన పదో తరగతి విద్యార్థి కార్తీక్ స్పృహతప్పి పడిపోయాడు. హుటాహుటిన అతన్ని ఏరియా వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమించడంతో వెంటనే హనుమకొండకు ఉపాధ్యాయులు తరలించారు. ప్రస్తుతం కార్తీక్ ఆరోగ్యం ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. గంటల వ్యవధిలోనే ముగ్గురు విద్యార్థులు అస్వస్థతకు గురికావడం, ఒకరి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో తోటి విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. కాగా, గురుకులంలో చదువుతున్న తమ పిల్లలు ఎలా ఉన్నారోనని తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు ఫోన్‌లు చేసి వాకబు చేశారు.

5న గిరిజన గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

హనుమకొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని యాకుబ్‌పుర గిరిజన బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 5వ తేదీన తక్షణ(స్పాట్) ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయ అధికారి వెంకటేశ్వరరాజు, ప్రిన్సిపాల్ జి.రామ్మోహన్ తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ-15, బీపీసీ 21, 5 తరగతిలో 6, అలాగే 9వ తరగతిలో 8 చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తిగల గిరిజన బాలురు ఉదయం 10గంటలకు వరంగల్‌లోని యాకూబ్‌పుర గిరిజనబాలుర గురుకుల పాఠశాలలో హాజరు కావాలన్నారు. వివరాలకు 9490957296 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చునని తెలిపారు.

బాలికల పాఠశాలలో..

హనుమకొండ దేవన్నపేటలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో 2024-25 సంవత్సరానికిగాను 5వ తరగతి, ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరంలో సీట్ల ఖాళీల భర్తీకి ఈనెల 5వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కోరే జ్యోత్స్న తెలిపారు. 5వ తరగతిలో 3 (ఎస్టీ కేటగిరి), ఎంపీసీ మొదటి సంవత్సరంలో 4 సీట్లు (ఎస్టీ కేటగిరి) ఖాళీగా ఉన్నాయని తెలిపారు. స్పాట్ అడ్మిషన్లు, ఈనెల 5వ తేదీన ఉదయం 10 గంటల నుంచి హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం దేవన్నపేటలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో నిర్వహిస్తారు. వచ్చే విద్యార్థినులు అన్ని ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీని తీసుకొని రావాలని అన్నారు. వివరాలకు 8919948321 నెంబర్‌లో సంప్రదించవచ్చు.

8వ తేదీన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 2: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్ కామ్), రాష్ట్ర ప్రభుత్వ కార్మిక ఉపాధి శిక్షణ కింద తెలంగాణ నుంచి అర్హత, నైపుణ్యం కలిగిన వారు, సెమీస్కిల్డ్ కార్మికులకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా ఉపాధి అధికారి సిహెచ్. ఉమారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8వ తేదీన ములుగురోడ్‌లోని ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆబ్రాడ్, జర్మనీ, జపాన్ దేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 8125251408, 9100798204లలో సంప్రదించవచ్చని ఆమె సూచించారు.

స్కూల్ బస్సు దిగబోతూ..

- టైరు కింద పడి ఏడేళ్ల బాలుడి మృతి
- డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన


సంఘటనా స్థలం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు, పరిశీలిస్తున్న సీఐ

జనగామ కల్చరల్, ఆగస్టు 2: స్కూలు బస్సు దిగబోతూ వెనక టైరు కింద పడి ఏడేళ్ల బాలుడు మృతి చెందాడు. ఇందుకు డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమంటూ బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకొని వారిని శాంతింపజేశారు. వివరాల్లోకి వెళితే.. జనగామ మండలం అడవి కేశ్వాపురం గ్రామానికి చెందిన బానోతు గణేష్-మంజుల దంపతుల కుమారుడు వరుణ్(7) జిల్లా కేంద్రంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం యథావిధిగా స్కూలుకు వెళ్లి ఇంటికి వస్తూ బస్సు దిగుతుండగా పుస్తకాల బ్యాగు డోర్‌కు తట్టుకొని వెనుక టైరు కింద పడిపోయాడు. డ్రైవర్ మహేందర్ చూసుకోకుండా బస్సును ముందుకు తీసుకెళ్లడంతో వెనక టైరు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మరి కొద్ది నిమిషాల్లో ఇంటికి వస్తాడనుకున్న కొడుకు కళ్లెదుటే విగత జీవిగా పడి ఉండడం చూసి తల్లిదండ్రులు గుండెలు బాదుకున్నారు. పోలీసులు బస్సును సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

బస్సు అద్దాలు ధ్వంసం..

ఈ ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బంధువులు, కుటుంబసభ్యులు అక్కడకు చేరుకొని బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. విద్యార్థి బస్సు దిగకుండానే డ్రైవర్ బస్సు నడపడంతో బాలుడు మరణించాడని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని, కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన నిర్వహించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ రఘుపతిరెడ్డి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి మృతదేహాన్ని జనగామ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పీడీఎస్ బియ్యం పట్టుకున్న పోలీసులు

- 125 క్వింటాళ్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న బియ్యం

వరంగల్ క్రైం, ఆగస్టు 2: జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం సౌరారం గ్రామంలోని రైస్‌మిల్‌లో నిల్వ ఉంచిన రూ.3లక్షల 12వేల విలువ కలిగిన పీడీఎస్ రైస్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండల పరిసర గ్రామాల్లో సేకరించిన పీడీఎస్ రైస్‌ను డి.రమేశ్ అనే వ్యక్తి రైస్‌మిల్‌లో నిల్వ చేసినట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ శరత్ ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు చేశారు. రైస్‌ను స్వాధీనం చేసుకుని రమేశ్‌ను అదుపులోకితీసుకుని విచారణనిమిత్తం జఫర్‌గడ్ పోలీసులకు అప్పగించారు.

కోత యంత్రం తగిలి వ్యక్తి మృతి

- చెట్టు కొమ్మలు/కోస్తుండగా ప్రమాదం

చిట్యాల, ఆగస్టు 2: కోత యంత్రం సహాయంతో చెట్టు కొమ్మలు తొలగిస్తుండగా ప్రమాదవశత్తు వ్యక్తికి తగలడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని గోపాలపరం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సాదువెల్లి పైడయ్య(55) సొంతంగా కోత యంత్రం కొనుగోలు చేసి గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో చెట్లు కోసేందుకు కూలీకి వెళ్తుంటాడు. కాగా గ్రామంలోని ఓవ్యక్తి ఇంటి వద్ద చెట్టు కొమ్మను తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు యంత్రం పైడయ్య ఛాతికి తగలడంతో తీవ్ర రక్తస్రావమైంది. ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడని తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్సై శ్రావణ్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు ఉన్నాడు.

అగ్నిమాపక శాఖలో జిల్లాలకు ఫైర్‌మన్‌ల కేటాయింపు

మట్టెవాడ, ఆగస్టు 2: అగ్నిమాపక శాఖలో కొత్తగా చేరి హైదరాబాద్‌లోని అగ్నిమాపక శాఖ శిక్షణ కేంద్రంలో నాలుగు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న ఫైర్‌మెన్‌లకు వివిధ జిల్లాల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు 51 మంది ఫైర్‌మెన్లు శిక్షణ పూర్తి చేసుకున్నారు. వారికి వివిధ జిల్లాల్లో రాష్ట్ర అగ్నిమాపక శాఖ డీసీ పోస్టింగ్ ఇచ్చారు. వరంగల్ జిల్లాకు 18 మంది, హనుమకొండ జిల్లాకు 10 మంది, జనగామ జిల్లాకు 10, మహబూబాబాద్ జిల్లాకు ఇద్దరు, ములుగు జిల్లాకు ఆరుగురు, భూపాలపల్లి జిల్లాకు 5 మంది ఫైర్‌మెన్‌లను కేటాయించారు.

ఉపాధ్యాయుడికి వెంకయ్యనాయుడి ప్రశంస

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 2: హనుమకొండ బ్రాహ్మణవాడలో నివాసముంటున్న హనుమాండ్ల జనార్దన్‌ను మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ప్రశంసించారు. రెండు రోజుల క్రితం దుగ్గొండి ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల నుంచి హిందీ ఉపాధ్యాయుడిగా ఆయన ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో ఉపాధ్యాయ దంపతులను పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు కలిసి ఎడ్లబండిపై గ్రామంలో ఊరేగించడం, అడుగడుగునా వారిపై పూలవర్షం కురిపించడం ఆ గురువు పట్ల అద్భుతభక్తి ప్రదర్శించిన తీరు సోషల్ మీడియాలో వైరల్ అయింది. అది ఏకంగా వెంకయ్య నాయుడు దృష్టికి కూడా పోయింది. ఈ క్రమంలో ఆయన తన ట్విట్టర్‌లో ఆ ఉపాధ్యాయుడిని ప్రత్యేకంగా ప్రశంసించడం చర్చనీయాంశంగా మారింది.

మానవరహిత సబ్‌స్టేషన్లుగా రూపాంతరం

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

హనుమకొండ టౌన్, ఆగస్టు 2: మొదటి దశగా కార్పొరేషన్ పరిధిలోని సబ్‌స్టేషన్‌లను మానవరహిత సబ్‌స్టేషన్లుగా రూపాంతం చేస్తున్నామని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ భవన్‌లో ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఎస్ఈ, డీఈ, నోడల్ ఆఫీసర్లతో సీఎండీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్ల డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. విద్యుత్ అంతరాయాలను కనిష్ఠ స్థాయికి తీసుకరావాలన్నారు. షెడ్యూల్ మెయింటెనెన్స్ అంత యాప్‌లో పొందపర్చాలన్నారు. కార్పొరేషన్ సబ్‌స్టేషన్ల తర్వాత మున్సిపాలిటీల్లో మానవరహిత సబ్‌స్టేషన్లను సిద్ధం చేస్తామన్నారు. ఫీడర్లకు ప్రత్యామ్నాయసరఫరా, రింగ్‌మైన్‌ల ఏర్పాటు ఉండేటట్లు చూసుకోవాలన్నారు. కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకొని వినియోగదారులకు మరింత మెరుగైన సేవలందించడానికి కంకణబద్ధులై పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, సీజీఎంలు, జీఎంలు పాల్గొన్నారు.

జనగామ సబ్ రిజిస్ట్రార్‌గా అన్వేషిత



అన్వేషితను సన్మానిస్తున్న రియల్ ఎస్టేట్ యూనియన్ సభ్యులు

జనగామ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జనగామ సబ్ రిజిస్ట్రార్‌గా జి.అన్వేషిత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జనగామ సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న టి.సంపత్‌కుమార్ ఖమ్మం జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1గా బదిలీ కాగా ఆయన స్థానంలో నల్లగొండ జిల్లా నకిరేకల్ సబ్‌రిజిస్ట్రార్‌గా ఉన్న జి.అన్వేషిత జనగామ సబ్‌రిజిస్ట్రార్‌గా బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆమెను కార్యాలయ సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లు అభినందించారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్ అన్వేషితను జనగామ జిల్లా రియల్ ఎస్టేట్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మహ్మద్ అబ్దుల్ ఖాదర్, గుంటుక దామోదర్‌రెడ్డి, కాంటూరి అంజాజి, ఆంజనేయులు, రాములు, కృష్ణ, అశోక్ తదితరులు సన్మానించారు.



సీఎం రేవంత్‌రెడ్డితో కొమ్మూరి

జనగామ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

సీఎంను కోరిన కొమ్మూరి

జనగామ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జనగామ నియోజకవర్గ అభివృద్ధికి మరింతగా నిధులు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి కోరారు. హైదరాబాద్ సీఎం రేవంత్‌రెడ్డిని కొమ్మూరి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ అభివృద్ధిపై మరింత చొరవ చూపాలని సీఎంను కోరారు.

జఫర్‌గడ్ ఎస్సైగా రామ్‌చరణ్



జఫర్‌గడ్, ఆగస్టు 2 : జఫర్‌గడ్ నూతన ఎస్సైగా బానోత్ రామ్‌చరణ్ నియమితులయ్యారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన శీలం రవియాదవ్‌ను ఇటీవల సస్పెన్షన్ చేశారు. ఈ నేపథ్యంలో కాకతీయ యూనివర్సిటీ పోలీసుస్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రామ్‌చరణ్‌ను ఇక్కడికి బదిలీ చేస్తూ వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్‌కిషోర్ ఝూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు.







జనగామ చౌరస్తాలో మిఠాయి పంచుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, దేవరుప్పులలో మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, ఘన్‌పూర్‌లో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

'వర్గీకరణ' సంబరాలు

ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు

జనగామ కల్చరల్, ఆగస్టు 2: ఎస్సీలలో ఏబీసీడీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును గౌరవిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణ అమలుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించడం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని చౌరస్తాలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కేకు కట్ చేసి మిఠాయి పంచారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడుతూ 30 సంవత్సరాల న్యాయ పోరాటానికి ధర్మాసనం తెరవేయడం, సీఎం స్పందించి అమలుకు సన్నాహాలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, రాజమౌళి, సర్వల నర్సింగరావు, మేడ శ్రీనివాస్, చెంచారపు బుచ్చిరెడ్డి, లింగాల నర్సిరెడ్డి, నూకల బాల్‌రెడ్డి, గణిపాక మహేందర్, బనుక శివరాజ్, రాంచంద్రం, బొట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

జఫర్‌గడ్: ఎస్సీల రిజర్వేషన్ వర్గీకరణకు మద్దతుగా సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడంపై ఎమ్మార్పీఎస్, అనుబంధ ఎంఎస్ఎఫ్ నాయకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం జఫర్‌గడ్‌లో సంబురాలు జరుపుకున్నారు. మండల కేంద్రంలో బీఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. సెంటర్‌లో బాణసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఎస్సీల రిజర్వేషన్ వర్గీకరణ కోసం మూడు దశాబ్దాల పాటు సాగించిన పోరాటం ఫలించిందన్నారు. మాదిగ జాతి యావత్తూ పోరాడి సాధించుకున్న విజయంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, బీజేపీ నాయకులు రడపాక ఆదాం, కోరుకొప్పుల నాగేశ్ గౌడ్, గాదెపాక మహేందర్, గంగాధరి రవిందర్, మారపల్లి బాబు, బొందుగుల కొమురయ్య, గబ్బెట వెంకన్న, గాదె కుమార్, తాటికాయల హరికృష్ణ, బీజేపీ నేతలు గాదెపాక శ్రీను, మారెపల్లి రవి, సింగారపు రమేశ్, రడపాక నరేశ్, గిరబోయిన రమేశ్, గొలుసుల లింగన్న, లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

దేవరుప్పుల: ఎస్సీల వర్గీకరణకు సుప్రీంకోర్టు పచ్చజెండా ఊపడంతో బీఆర్ఎస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు మాచర్లబాబు ఆధ్వర్యంలో శుక్రవారం మండలకేంద్రంలోని చౌరస్తావద్ద మందకృష్ణ మాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా బాబు మాట్లాడుతూ మందకృష్ణ పోరాటం వృథా కాలేదని, ఆయన పట్టుదల, కృషి నేటికి ఫలించిందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చింత రవి, జోగు సోమనర్సయ్య, జేరిపోతుల సాయిలు, మేడ సోమనర్సయ్య, కత్తుల సుధాకర్, భాషిపాక సోమయ్య, చింత యాదగిరి, బాషిపాక అబ్బయ్య, జోగు అయిలుమల్లు, గోపాల్‌దాస్ మల్లేష్, గుండె రమేష్, యాకన్న పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: మండలకేంద్రంలో బీజేపీ నాయకులు ప్రధాని మోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో చేపట్టిన ముప్పై ఏళ్ళ పోరాటం నేడు ఫలించిందన్నారు. ఇందుకు సహకరించిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా మండలాధ్యక్షుడు అరిశాల తిరుపతి, నాయకులు రడపాక ప్రదీప్, ఆరోగ్యం, సట్ల వెంకటరమణ, కొలనుపాక శరత్, రజిత, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: ఎస్సీ వర్గీకరణను తెలంగాణలో మొదటగా అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 ఏళ్లుగా వర్గీకరణ కోసం పోరాటాలు సాగగా, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తక్షణం అమలు చేస్తామని సీఎం ప్రకటించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో నూకల బాల్‌రెడ్డి, జంగిటి విద్యానాథ్, నిడిగొండ శ్రీనివాస్, ఎండీ మసూద్, నల్లనాగుల వెంకటాచారి, గుర్రపు బాల్‌రాజు, మహేందర్, హరీష్, క్రాంతి, నీల రమేశ్, జ్యోతి భాస్కర్ పాల్గొన్నారు.

బచ్చన్నపేట: ముప్పై ఏళ్ల పాటు వర్గీకరణ కోసం అలుపెరుగని పోరాటం చేసిన మందకృష్ణ మాదిగ కృషి తమ జాతి ఎన్నటికీ మరిచిపోదని ఎంఆర్‌పీఎస్ జిల్లా కోఆర్డినేటర్ ఫైస రాజశేఖర్, ఎంఎస్ఎఫ్ మండల అధ్యక్షులు పాకాల కుమారస్వామి అన్నారు. శుక్రవారం వారు బచ్చన్నపేట చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 ఏళ్ల ఉద్యమానికి సార్థకత లభించిందన్నారు. కార్యక్రమంలో అల్వాల నర్సింగరావు, మాజీ మండల అధ్యక్షులు గిద్దెల రమేశ్, ఉదయ్‌కిరణ్, నల్ల అంజయ్య, స్వామి, ఎల్లయ్య, కిష్టయ్య, శ్రీనివాస్, అజయ్, కిషన్, యాదగిరి, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం, అభివృద్ధి పనులు చేపట్టాలి

- జడ్పీ ఇన్‌చార్జ్ సీఈవో సరిత



బచ్చన్నపేటలో మాట్లాడుతున్న జడ్పీ ఇన్‌చార్జి సీఈవో సరిత

బచ్చన్నపేట, ఆగస్టు 2: గ్రామాల్లో పారిశుధ్యం, అభివృద్ధి పనులను చేపట్టాలని జడ్పీ ఇంచార్జ్ సీఈవో సరిత అన్నారు. శుక్రవారం స్థానిక రైతు వేదికలో నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ నెల 5 నుంచి 9 వరకు అన్ని గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే చర్యలుంటాయన్నారు. పారిశుధ్యం, తాగునీరు, ఇంకుడు గుంతలు, మొక్కలు నాటడం, రోడ్లపై గుంతలు పూడ్చటం, తదితర కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, క్రీడా ప్రాంగణాల్లో పిచ్చి మొక్కలు తొలగించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్, తహసీల్దార్ విశాలాక్షి, ఎంపీడీవో మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో స్వచ్ఛదనం-పచ్చదనంపై సదస్సులు..

కొడకండ్ల: ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం స్వచ్ఛదనం-పచ్చదనంపై ఎంపీడీవో నాగ శేషాద్రి సూరి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ నెల 5 నుంచి 9 వరకు గ్రామాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి తహసీల్దార్ చంద్రమోహన్, మండల వైద్యాధికారి హరికృష్ణ, ఏపీవో కుమారస్వామి, సూపరిండెంట్ ఇందిర, ఏవో విజయ్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

జఫర్‌గడ్: ఈనెల 5 నుంచి చేపట్టనున్న స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని డివిజనల్ పంచాయతీ అధికారి వెంకట్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారం ఇంటింటా మొక్కల పంపిణీ, నాటడంతో పాటు స్వచ్ఛతపై ప్రజలకు వివరిస్తూ చైతన్యవంతం చేయాలన్నారు. పరిశుభ్రత, తాగునీరు కలుషితం కాకుండా చూడడం, మురికి గుంతలను పూడ్చడం, దోమల నివారణకు చర్యలు, ప్రజలపై శునకాల దాడులను అరికట్టడం, తదితర అంశాలపై రోజువారీ కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ఎల్.మనోహర్, ఎంపీడీవో సుమన్, తహసిల్దార్ శంకరయ్య, డిప్యూటీ తహసిల్దార్ హరిప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సుకన్య, తదితర అధికారులు, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

లింగాలఘణపురం: ఈనెల 5 నుంచి 9 వరకు నిర్వహించే స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్‌రావు, ఎంపీడీవో జలంధర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాల స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులతో వారు సమీక్ష నిర్వహించారు. రోజువారీ కార్యక్రమాలను సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో రఘురామకృష్ణ, సూపరింటెంట్ సీతారాంనాయుడు, గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చిలుపూర్: ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం విజయవంతం చేయడం కోసం ప్రతీఒక్కరూ కృషి చేయాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేక అధికారి మాధవీలత కోరారు. శుక్రవారం ఎమ్మార్సీ భవనంలో నిర్వహించిన సన్నాహక సదస్సులో ఆమె మాట్లాడారు. షెడ్యూల్ ప్రకారం చేపట్టాల్సిన పనులపై గ్రామస్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా పశుసంవర్ధక శాఖ నేతృత్వంలో కుక్కల గణన చేపట్టి వాటికి వ్యాక్సినేషన్ చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో విక్రమ్ కుమార్, ఎంపీడీవో బర్మావత్ శంకర్, తహసీల్దార్ సరస్వతి, ఈజీఎస్ ఏపీవో మోహన్‌రావు, మండల పశువైద్యాధికారి డాక్టర్ అనేష్, పంచాయతీ సెక్రటరీలు ఎమ్డీ ఆజీజ్‌పాషా, శ్రీరంగారెడ్డి, శశిధర్‌రెడ్డి, హరిప్రసాద్, బాపూ నాయక్, మధుసూధన్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఎస్టీ కమిషన్ సభ్యుడు



పాఠశాలను పరిశీలిస్తున్న హుస్సేన్ నాయక్

జనగామ కల్చరల్, ఆగస్టు 2: జనగామ చంపక్‌హిల్స్‌లో గల గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ శుక్రవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి ఆశ్రమ సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా భవన నిర్మాణం చేపట్టేందుకు సర్వేనంబరు 140 లోని 5 ఎకరాల స్థలాన్ని కేటాయించే విషయం పరిశీలిస్తామన్నారు. అనంతరం ఆయనకు జిల్లా బంజారా నాయకులు వినతిపత్రం అందించారు. చంపక్‌హిల్స్ లోని ఆశ్రమ పాఠశాలలో 300 మంది విద్యార్థులు ఉన్నారని, వారికి సరిపడే తరగతి గదులు, హాస్టల్ గదులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి 5 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని, జిల్లా కేంద్రంగా మైదాన ప్రాంత ఐటీడీఏ ఏర్పాటు చేయాలని, జిల్లా కేంద్రంలో గిరిజన సంక్షేమ కార్యాలయం ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో మూడ్ లక్ష్మణ్ నాయక్, కౌన్సిలర్ అనిత, అజ్మీరా స్వామి నాయక్, లకావత్ నరేష్, భూక్యా చందు నాయక్, ధర్మబిక్షం, సురేష్ పాల్గొన్నారు.

'త్వరితగతిన వ్యవసాయ కనెక్షన్లు'

జనగామ కల్చరల్, ఆగస్టు 2: రైతులకు త్వరితగతిన వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నామని జనగామ సర్కిల్ సూపరింటెండెంటింగ్ ఇంజనీర్ టి.వేణుమాధవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది నాలుగు నెలల్లో 992 సర్వీసులు మంజూరు చేశామని, ఈ ఏడాది ఇప్పటి వరకు 1031 సర్వీసులు మంజూరు చేశామని అన్నారు. సర్వీసుల మంజూరు మొత్తం ఆన్‌లైన్ చేయడం ద్వారా తొందరగా మంజూరవుతున్నాయని అన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని కూడా పెంచామని, వంగిన పోల్‌లు, లూస్‌లైన్లు కూడా సరి చేస్తున్నామన్నారు. రైతులకు మరింత చేరువై వారి సమస్యలను పరిష్కరించే దిశగా పొలంబాట కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

కోమల్లలో పట్టపగలే ఇంట్లో చోరీ

రూ. 70 వేలు అపహరణ

రఘునాథపల్లి, ఆగస్టు 2: పట్టపగలే గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి రూ.70 వేల నగదును అపహరించారు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అమనగంటి చంద్రయ్య-రాజమ్మ దంపతులు శుక్రవారం ఉదయం ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చే సరికి తాళం పగులగొట్టి ఉండడం గమనించి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరిచి ఉండడంతో పాటు వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో పెట్టుబడుల కోసం దాచి ఉంచిన రూ.70 వేల నగదు కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.నరేష్ తెలిపారు.

శివాలయానికి రూ.51 వేల విరాళం



ఆలయ అభివృద్ధికి విరాళం అందిస్తున్న పొన్నాల రామ్‌మోహన్

నర్మెట, ఆగస్టు 2 : మండలకేంద్రంలో పునర్నిర్మాణం చేపడుతున్న కాశీ విశ్వనాథ శివాలయానికి ఖిలాషాపురం గ్రామానికి చెందిన పొన్నాల రామ్‌మోహన్ కుమారుడు పొన్నాల వంశీకృష్ణ రూ.51,116ల విరాళం అందించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపి పొన్నాల రామ్‌మోహన్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు గంగం నర్సింహరెడ్డి, ఉపాధ్యక్షుడు జంగిటి అంజయ్య, రంగరాజు వెంకటరమణరావు, దేవులపల్లి భాగ్యలక్ష్మి, కొండం బాలయ్య, ప్రజ్ఞాపురం శ్రీధర్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 2: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సీపీఐ నాయకులు సిద్ధం కావాలని పార్టీ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్.రాజారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేసే విధంగా ఒత్తిడి తేవాలన్నారు. అందుకోసం జనాన్ని చైతన్యపరచాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సముద్రాల రాజు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, మహ్మద్ యూసుఫ్, తోట రమేష్, నాగరాజు, యాదగిరి, అజయ్ పాల్గొన్నారు.

కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆందోళన

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు2: తమపై సోషల్‌మీడియాలో ఆరోపణలు చేయడమే కాకుండా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని విశ్వనాథపురం గ్రామస్థులు జీపీ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బొందయ్య, యాదగిరి, సరోజన, ఎల్లేశ్, ఎల్లయ్య, నర్సమ్మ, చంద్రయ్య, అశోక్ తదితరులు మాట్లాడుతూ కుమారస్వామి అనే వ్యక్తి భూతగాదా విషయంలో తమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులను ఇబ్బందులపాల్జేసేందుకు మరో సామాజిక వర్గానికి చెందిన వ్యక్తితో చేతులు కలిపి 12 మందిపై అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు. అసలు తాము కుమారస్వామిని కులబహిష్కరణ చేయనేలేదని, అయినా ఉద్దేశ్యపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈవిషయంలో పోలీసులు విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

125 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

జఫర్‌గడ్, ఆగస్టు 2 : మండలంలోని సూరారంలో అక్రమంగా నిల్వ చేసి ఉన్న 125 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. జఫర్‌గడ్ ఎస్ఐ రామ్‌చరణ్ నేతృత్వంలో పోలీసులు, టాస్క్‌ఫోర్స్ బృందం సంయుక్త ఆధ్వర్యంలో సూరారంలోని ఓ రైసు మిల్లులో ఆకస్మిక దాడులు జరిపారు. అక్రమంగా కొనుగోలు చేసి మిల్లులో బస్తాల్లో నిల్వ ఉంచిన 125 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా డంప్ చేసిన జఫర్‌గడ్‌కు చెందిన దొడ్డ రమేశ్ పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 2 : మండలంలోని మీదికొండ సాయిబాబా కాలనీలో రూ.5 లక్షల ఎస్‌డీపీ నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను మాజీ సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ నాయకుడు నాగరబోయిందర శ్రీరాములు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఏదునూరి రాజు, జోగు రాజేష్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టులు

బచ్చన్నపేట, ఆగస్టు 2: పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచ్‌ల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం చలో సెక్రటేరియట్‌కు పిలుపునివ్వగా ఎవరు తరలివెళ్లకుండా పోలీసులు వారిని అరెస్ట్ చేసి పీఎస్‌కు తరలించారు. దీంతో ప్రభుత్వ తీరుపై మాజీ సర్పంచ్‌లు వడ్డేపల్లి మల్లారెడ్డి, నరెడ్ల బాల్‌రెడ్డిలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 8 మాసాలు గడుస్తున్నా, ఇప్పటి వరకు బిల్లులు ఇవ్వకుండా తాత్సారం చేస్తోందని విమర్శించారు. పెండింగ్ బిల్లులు విడుదల చేసిన అనంతరమే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో కోనేటి స్వామి, పర్వతం మధుప్రసాద్, మునిని రాజుగౌడ్, తాతిరెడ్డి శశిధర్‌రెడ్డి, మహ్మద్ ఆజాం, శివరాత్రి రాజనర్సయ్య తదితరులున్నారు. కాగా ప్రజా సేవలో ఐదేళ్ల పాటు ఉన్న మాజీ సర్పంచ్‌లను అక్రమంగా అరెస్టులు చేయటం దారుణమని, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు గంగం సతీష్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

'బురద జల్లే ప్రయత్నాలు మానుకోవాలి'

జనగామ కల్చరల్, ఆగస్టు 2: కాంగ్రెస్ పార్టీపై బురద జల్లే ప్రయత్నాలను బీఆర్ఎస్ నాయకులు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు హితవుపలికారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో వేమళ్ల సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన చూసి బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల పాలుచేశారని ఆరోపించారు. ఒక్క మహిళా మంత్రి లేకుండా ప్రభుత్వం నడిపారని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడ్డాక మహిళా మంత్రులు ఎందరు ఉన్నారో లెక్క పెట్టుకోవాలని సూచించారు.

కరపత్రం ఆవిష్కరణ

పాలకుర్తి, ఆగస్టు 2 : ఈ నెల 4న వరంగల్‌లో జరిగే అసంఘటిత రంగ కార్మిక సంఘాల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యలయం వద్ద కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర నాయకుడు మొలుగూరి యాకయ్య మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యూలరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

మాలల ఓట్లతోనే కాంగ్రెస్ గెలిచింది



సమావేశంలో మాట్లాడుతున్న మాలమహాసభ రాష్ట్ర నేత తాటి కుమార్

జనగామ కల్చరల్, ఆగస్టు 2: మాలల ఓట్లతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందనే విషయం గుర్తుంచుకోవాలని మాలమహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాటికుమార్ అన్నారు. మాదిగల వర్గీకరణ పట్ల సీఎం రేవంత్‌రెడ్డి అమలుకు సన్నాహాలు చేయాలని ప్రకటించడంపై తాటి కుమార్ స్పందించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగలు, మాలలను వేరువేరుగా చూడడడం సబబు కాదన్నారు. మాదిగల కంటే వెనుకబడిన మాలలు ఎంతో మంది ఉన్నారన్నారు. మాలలు ఆర్థికంగా ఎదిగిన దాఖలాలు లేవన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటలు మాలలు, మాదిగలను అణగదొక్కుతున్నారనే భావనను కల్పిస్తున్నాయన్నారు. మోదీ హామీతో మాదిగలంతా బీజేపీకి ఓట్లేస్తే మాలలు మాత్రం కాంగ్రెస్ పార్టీకి ఓట్లేసి రేవంత్‌రెడ్డిని సీఎం చేశారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మాల మహాసభ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల ఇన్‌చార్జి ముత్యం నాగభూషణం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల శంకరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కుడుదుల యాదగిరి, ఎండబట్ల పరశురాములు, ఎండబట్ల అశోక్, ధర్మయ్య, గునిగంటి శేఖర్, గద్ద సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం..

కొడకండ్ల: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని తెలంగాణ మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల వెంకన్న అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని మాల కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పును ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జవ్వాజి సాయిబాబా, గొల్లపెల్లి అనిల్, బీరకాయల సోమయ్య, సుకేమారు, దేవయ్య, సతీష్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.